సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 21 । మే । 2024



రూ.51,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి బల భద్ర రాయుడు కుటుంబం (రాజోలు) సోమ వారం రూ.51,116 విరాళం సమర్పించింది.



వేంకటేశ్వరునికి రూ.లక్ష

దేవరపల్లి: స్థానిక శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సుబ్రహ్మణ్యం దంపతులు (గౌరీపట్నం) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
39.0°/26.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	37.0	27.0
కాకినాడ	37.0	26.3
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

కొబ్బరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



ఎండు కొబ్బరి

అంబాజీపేట: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు నాఫెడ్ ఆధ్వర్యంలో కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ డిప్యూటీ కార్యదర్శి సంజయ్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేసినట్టు ఆయిల్‌ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 15న రాసిన లేఖ ఆధారంగా 8 వేల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ కోప్రాను 6 నెలల వ్యవధిలో కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. గత ఏడాది బాల్ కోప్రాను రూ.11,750 కు కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.12 వేలకు కొనుగోలు చేస్తారన్నారు. మిల్లింగ్ కోప్రాను రూ.10,860కు గత ఏడాది కొనుగోలు చేయగా ఈ ఏడాది రూ.11,120కు కొనుగోలు చేస్తారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అవసరమైన అనుమతులు తీసుకున్న తరువాతే కొనుగోలు తేదీని ప్రకటించాలని సంజయ్‌కుమార్ సూచించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించే ముందు కేంద్ర నోడల్ ఏజెన్సీ అన్ని రకాల వసతులు పరిశీలించి తగిన నివేదికను రూపొందించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన జీవో కాపీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ శ్రీధర్‌కు పంపినట్లు సంజయ్‌కుమార్ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో వేంచేసియున్న శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందింది. ఆలమూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వంటిపల్లి పాపారావు సోమవారం స్థానిక ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఇసుక ర్యాంపుల తనిఖీకి ప్రత్యేక యంత్రాంగం

జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఏడీ సాయిరాం



కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న సాయిరాం, ఇతర అధికారులు

కపిలేశ్వరపురం: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని ఇసుక ర్యాంపులను తనిఖీ చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఏడీ సాయిరాం తెలిపారు. మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపులను సోమవారం ఆయన ఆధ్వర్యంలోని అధికారుల బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఇసుక ర్యాంపులను తనిఖీ చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై ఇక నుంచి ర్యాంపుల నిర్వహణపై వారాంతపు నివేదికలను పంపించనున్నామన్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా ర్యాంపులను సందర్శిస్తున్నామన్నారు. ర్యాంపుల నిర్వహణలో సమస్యలు తలెత్తినా, అక్రమాలు జరిగినా మైన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులను మైన్స్, పోలీస్, ఎస్ఈబీ, ఇరిగేషన్ తదితర అధికారులతో కూడిన బృందం పరిశీలిస్తుందన్నారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు, ర్యాంపులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసేందుకు జిల్లాలో రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు వి.శ్రీనివాస్, సుజాత, సర్వేయర్ ఎస్.సతీష్, వీఆర్వోలు ప్రసాద్, శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ ఏఈఈబీ శ్రీఫణిత, ఎస్ఈబీ ఎ.సత్యవాణి ఉన్నారు.

జంతు సంరక్షణ చట్టాల అమలుకు నోడల్ అధికారి

కాకినాడ క్రైం: హైకోర్టు ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టాల అమలుకు జిల్లా ప్రత్యేక నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావును నియమిస్తూ ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జంతు అక్రమ రవాణా, అక్రమ వధ వంటి అంశాల్లో ఎటువంటి సమాచారం అందినా ప్రజలు నేరుగా 94407 96501 నంబరుకు ఫోన్ చేసి, నోడల్ అధికారికి తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నే...రుగా ఖాతాల్లోకి...



మిచాంగ్ తుపాను వల్ల నేలకొరిగిన అరటిపంట



మిచాంగ్ తుపాను వల్ల అల్లవరంలో నీట మునిగిన వరి చేలు

- అన్నదాతలకు పెట్టుబడి రాయితీ... అక్కచెల్లెమ్మలకు చేయూత
- ఎన్నికల ముందే అందించేందుకు ప్రభుత్వం సిద్ధం
- కుటిల యత్నాలతో అడ్డుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- పోలింగ్ పూర్తి కావడంతో సొమ్ము జమ చేసిన వైనం
- జిల్లాలో 23,379 మంది రైతులకు లబ్ధి
- రూ.20.25 కోట్ల పంపిణీ
- ఇదే తరహాలో మహిళలకూ అందిన డబ్బు

సాక్షి అమలాపురం: ఒకరు ఆపత్కాలంలో రాజకీయాలను పక్కనబెట్టి ఆదుకునే నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. మరోవైపు ఆపత్కాలంలో సైతం స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేసే చంద్రబాబునాయుడు. వీరిద్దరి మధ్య వ్యత్యాసాన్ని తాజా ఎన్నికలు మరోసారి నిరూపించాయి. పంట నష్టపోయిన వెంటనే రెండో పంట కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పరిహారం (పెట్టుబడి రాయితీ రూపంలో) అందజేస్తోంది. కొన్నిసార్లు నెల రోజులలోనే ఈ పెట్టుబడి రాయితీ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసి అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచింది. గత ఏడాది ఖరీఫ్‌లో మిచాంగ్ తుపాను వల్ల వరి, ఉద్యాన పంటలు నష్టపోయిన రైతులకు రబీలో పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఎన్నికల ముందు పరిహారం అందించడం ద్వారా ఓటర్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభావితం చేస్తోందంటూ చంద్రబాబు తన కోటరీ మనుషులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారు. దీంతో రైతులకు పరిహారం పంపిణీ ఆలస్యమైంది. దీంతోపాటు చేయూత, ఈబీసీ నేస్తం వంటి పథకాల సొమ్ము లబ్ధిదారులకు అందకుండా చంద్రబాబు అడ్డుకున్నారు. ఎన్నికలు పూర్తి కావడంతో ప్రభుత్వం రైతులకు, మహిళలకు పరిహారం, ఆర్థిక సాయం పంపిణీని ప్రారంభించింది.

గత సంభవించిన ఏడాది మిచాంగ్ తుపాను వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు కలిగిన నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి రాయితీ అందించింది. 23,379 మంది రైతులకు రూ.20.25 కోట్ల పెట్టుబడి రాయితీ అందించాల్సి ఉంది. ఈ సొమ్ము ఎన్నికల ముందు రైతుల ఖాతాలో జమ కావాల్సి ఉంది. చంద్రబాబు ఎన్నికల కమిషన్ ద్వారా కుట్ర పూరితంగా అడ్డుకున్నారు. అప్పట్లోనే పరిహారం అంది ఉంటే రైతులకు రబీ కోతలకు అక్కరకు వచ్చేది. గత ఏడాది మిచింగ్ తుపాను వల్ల కలిగిన నష్టంపై అధికారులు జనవరి మొదటివారంలో లెక్క తేల్చారు. తుపాను వల్ల భారీ వర్షాలతో వరితోపాటు ఉద్యాన పంటలైన అరటి, కూరగాయలు, కొబ్బరి పంటలకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. పంట నష్టాలపై తొలుత ప్రాథమిక అంచనాలు తయారు చేసిన జిల్లా యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాలతో డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తిస్థాయి నష్టపరిహార అంచనాలను రూపొందించింది. అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లలో వరికి అధికంగా నష్టం వాటిల్లింది. మొత్తం వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 28,938 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు లెక్క తేల్చారు. వరి సాగుకు పెట్టుబడి రాయితీగా హెక్టారుకు రూ.17,000, అరటికి హెక్టారుకు రూ.25 వేలు, కూరగాయలు, బొప్పాయి, పసుపు, పువ్వుల సాగుకు హెక్టారుకు రూ.17 వేల చొప్పన, తమలపాకు సాగుకు హెక్టారుకు రూ.75 వేల చొప్పున పెట్టుబడి రాయితీ అందనుంది. వీటితోపాటు దెబ్బతిన్న కొబ్బరి చెట్టుకు రూ.వెయ్యి చొప్పున రైతులకు అందుతోంది.

లబ్ధిదారుల ఖాతాలో చేయూత సొమ్ము

నవరత్నాలలో భాగంగా వైఎస్సార్ చేయూతను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వెనుకబడిన మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా వైఎస్సార్ చేయూతలో 45 నుంచి 60 సంవత్సరాల వయసు గల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు నాలుగు దఫాలలో రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

వైఎస్సార్ చేయూత పథకంలో జిల్లాలో లబ్ధిదారులకు నాల్గవ విడత సొమ్ము ఖాతాలో జమ కావాల్సి ఉంది. కాని ఎన్నికల కమిషన్ మోకాలు అడ్డడంతో లబ్ధిదారులకు ఈ నిధులు సకాలంలో జమ కాలేదు. జిల్లాలో 89,619 మంది లబ్ధిదారులకు రూ.168.03 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. దీనిని కూడా చంద్రబాబు అడ్డుకున్నారు. ఎన్నికల పూర్తి కావడం, నిధులు మహిళల ఖాతాలో వేసేందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించడంతో దఫదఫాలుగా ఈ సొమ్ము లబ్ధిదారులు ఖాతాలో వేస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మొత్తం నాలుగు విడతలకు రూ.649.02 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్టయింది. అలాగే ఆసరా పథకం లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో నిధులు వారి ఖాతాలో జమయ్యాయి.

ఈబీసీ నేస్తం సొమ్ము జమ

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, చేయూతతోపాటు ఈబీసీ నేస్తం సొమ్మును సైతం ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు మైనార్టీ వర్గాలు కాకుండా ఇతర అగ్రవర్ణాలకు చెందిన మహిళలకు ఈబీసీ నేస్తం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో ఈ పథకం ద్వారా 11,496 మంది మహిళలకు రూ.17.24 కోట్లను ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులకు నగదు జమ కాగా, మిగిలిన వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తోంది. ఈబీసీ నేస్తం ద్వారా 2021–22 ఆర్థిక సంవత్సరానికి 11,053 మందికి రూ.16.57 కోట్లు అందించగా, 2022–23 సంవత్సరానికి 12,818 మంది లబ్ధిదారులకు రూ.19.22 కోట్లు అందించింది. తాజాగా మూడవ విడత సొమ్ము అందజేస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు రావడంతో లబ్ధిదారులైన మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రమం తప్పకుండా ఇచ్చారు



నాకు చేయూత సొమ్ము వచ్చింది. గత నెలలోనే ఖాతాలో పడతాయనుకున్నాను. నాకు నాలుగవసారి ఈ సొమ్ము వచ్చింది. ప్రతిసారి క్రమం తప్పకుండా ర.18,750 చొప్పున ఇచ్చారు. బ్యాంకుకు వెళ్లి మరోసారి చూసుకోవాలి. నేను రుమాలీ రోటీ వ్యాపారం చేసుకుంటున్నాను. జగన్ ఇచ్చే సొమ్ము నా వ్యాపారానికి ఉపయోగపడుతోంది.

– విప్పర్తి ఈశ్వరీదేవి, కొంకాపల్లి, అమలాపురం మండలం

ఈ ప్రభుత్వంలోనే పరిహారం అందింది



నాకు రెండున్నర ఎకరాల వరి పొలం ఉంది. గత ఏడాది మిచాంగ్ తుపాను వల్ల ఖరీఫ్ పంట కొంత వరకు నష్టపోయాను. ఇప్పుడు రూ.10,300 వరకు పెట్టుబడి రాయితీ రూపంలో అందింది. ఈ ప్రభుత్వంలోనే పంట నష్టపోయిన తరువాత పంట కాలంలో పరిహారం అందింది.

– సలాది లక్ష్మణబాబు, రైతు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలపై నిఘా

- ఇష్టానుసారం విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు
- ఎన్నికల ఫలితాల రోజున విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి



అమలాపురంలో మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంశాలను వివరిస్తున్న పట్టణ సీఐ క్రిష్టోఫర్

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని పల్నాడు తదితర జిల్లాల్లో ఎన్నికల తర్వాత వివాదాలకు, విధ్వంసాలకు తెగబడ్డ అల్లరి మూకలకు సిట్ దర్యాప్తులతో ముకుతాడు వేస్తున్న నేపథ్యంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా జిల్లాలో బాణసంచా, మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలపై నిఘా పెంచింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న తయారీ కేంద్రాల వద్దకు రెండు రోజులుగా ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు స్వయంగా వెళ్లి తయారీదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి తర్వాత జరిగే విజయోత్సవ ర్యాలీల్లో బాణసంచా, మందుగుండు సామగ్రి కాల్చేందుకు తొలుత పోలీసుల నుంచి విధిగా అనుమతులు తీసుకోవాలి. విజయోత్సవ ర్యాలీల్లో బాణసంచా భారీ ఎత్తున కాల్చేందుకు అనుమతులు లేవు. విజయం సాధించిన అభ్యర్థుల అనుచరులు ఏర్పాట్లు చేసుకుని మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలకు వచ్చినప్పుడు తయారీదారులు కచ్చితంగా పోలీసుల నుంచి అనుమతి పత్రం ఉందా... లేదా...? రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఈ మేరకు జిల్లాలోని పోలీసు అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడంతో జిల్లావ్యాప్తంగా పలు తయారీ కేంద్రాల్లో పోలీసు అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదే విషయంపై జిల్లాలో ఎక్కడికక్కడ పోలీసు అధికారులకు స్థానిక ప్రజలు అవగాహన కూడా కల్పిస్తున్నారు. లైసెన్స్‌డ్ తయారీ కేంద్రాల్లో పరిమితులకు మించి బాణసంచా తయారు చేసినా, విక్రయించినా అనధికార కేంద్రాల ద్వారా విక్రయాలు సాగితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా అమలాపురం పట్టణ పరిధిలో ఉన్న మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలను పట్టణ సీఐ కె.కృష్టోఫర్ తన సిబ్బందితో సోమవారం వెళ్లి విస్తృతంగా తనిఖీ చేశారు. తయారీదారులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. మద్యం అక్రమ నిల్వలపై కూడా పోలీసులు కన్నేసి ఉంచారు. ఓట్ల లెక్కింపు రోజున విజయోత్సవాల ముసుగులో అల్లర్లు జరిగే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పోలీసు తనిఖీలు

మూడంచెల భద్రతపై సమీక్షలు, సూచనలు



శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: జిల్లాలోని అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రంగా నిర్దేశించిన కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం ఇప్పటికే పోలీసు వలయంలో ఉంది. ఇప్పటికే ఓట్లు నిక్షిప్తమైన ఈవీఎంలు ఆ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచిన సంగతి తెలిసిందే. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ మూడు రోజులుగా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతపై జిల్లా పోలీసు అధికారులు, కేంద్ర బలగాలతో సమీక్షిస్తూనే ఉన్నారు. మరోసారి సోమవారం సాయంత్రం తనిఖీలు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఏర్పాటు చేసిన అగ్ని మాపక శకటాలను కూడా ఆయన తనిఖీ చేసి ఆ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామమైన కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట ప్రాంతాల్లో డీఎస్పీలు ఎం.మహేశ్వరరావు, బి.రామకృష్ణ, రమణ సీఐలు, ఎస్సైలతో కలసి తనిఖీలు చేశారు. లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా తిరుగుతున్న మోటారు సైకిళ్లను పట్టుకుని సీజ్ చేశారు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాలను జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

పాఠ్య పుస్తకాలొచ్చేస్తున్నాయ్

- ముందుచూపుతో మేల్కొన్న పాఠశాల విద్యాశాఖ
- 1–7 తరగతులకు పుస్తక గోదాం నుంచి మండలాలకు సరఫరా
- 8–10 తరగతులకు ప్రింటింగ్ ప్రెస్ నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్లకు
- జిల్లాకు 16.75 లక్షల పాఠ్య పుస్తకాలు అవసరం



పాఠ్య పుస్తకాలు

రాయవరం: పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ప్రతి విద్యార్థి చేతిలో పాఠ్య పుస్తకం ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ మార్చి నుంచే చర్యలు ప్రారంభించింది. పాఠ్య పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగు దఫాలుగా విద్యాకానుకను విజయవంతంగా, నాణ్యతతో విద్యార్థులకు అందజేశారు. అదే ఒరవడిలో పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకం, విద్యాకానుక కిట్లు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విద్యాశాఖ అడుగులు వేస్తోంది. ఈ ఏడాది కూడా పాఠ్య పుస్తకాలను విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే ఇచ్చే విధంగా పాఠ్య పుస్తకాల ముద్రణ, సరఫరా ప్రారంభించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు జిల్లా గోదాంకు రావడం ప్రారంభించాయి. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రతి పాఠ్య పుస్తకం కవర్‌పేజీలో మార్పులు చేసి, విద్యార్థిని ఆకట్టుకొనే విధంగా తీర్చిదిద్దారు. పాఠ్య పుస్తకంలో క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. దీని ద్వారా పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారాన్ని పొందవచ్చు.

పాఠ్య పుస్తకాల సరఫరా తరగతుల వారీగా ఇలా...

తరగతి	మొత్తం టైటిల్స్	సెమిస్టర్ 1,2	నాన్ సెమిస్టర్
10	13	గణితం	తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సైన్స్, సోషల్
9	15	గణితం, పీఎస్	తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బయాలజీ, సోషల్
8	13	గణితం, పీఎస్	తెలుగు, హిందీ, ఇంగ్లిష్ బీఎస్, సోషల్
7	09	గణితం, సైన్స్,	తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సోషల్
6	09	గణితం, జనరల్	తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సైన్స్, సోషల్
5	12	గణితం,ఈవీఎస్	తెలుగు, ఇంగ్లిష్,
4	12	గణితం,ఈవీఎస్	తెలుగు, ఇంగ్లిష్,
3	12	గణితం,ఈవీఎస్	తెలుగు,ఇంగ్లిష్
2	08	గణితం	తెలుగు, ఇంగ్లిష్
1	08	గణితం	తెలుగు, ఇంగ్లిష్

దశల వారీగా అన్ని తరగతులకు సెమిస్టర్ విధానం

పుస్తకాల బరువుతో విద్యార్థుల వెన్నుముకపై భారం పడకుండా ఉండేందుకు సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 1–9వ తరగతి వరకు సెమిస్టర్ విధానం అమలు చేయగా, ఈ ఏడాది పదవ తరగతికి కూడా అమలు చేశారు. గణితం, సైన్స్ సబ్జెక్టులను రెండు సెమిస్టర్లుగా విడదీశారు. సిలబస్ మొత్తాన్ని జూన్ నుంచి అక్టోబర్ వరకు సెమిస్టర్-1, నవంబర్ నుంచి మార్చి వరకు సెమిస్టర్–2గా విభజించారు. దశలవారీగా అన్ని తరగతులకు సెమిస్టర్ విధానం అమలు చేశారు. 1–10 తరగతులకు పాఠ్య పుస్తకాల్లో బైలింగ్విల్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఒక పేజీలో ఇంగ్లిషు, ఒక పేజీలో తెలుగు పాఠ్యాంశాన్ని ముద్రించి ఇవ్వడం వల్ల విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుని చదువుకునే వీలుంటుంది. 1–10 తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలకు సంబంధించి 111 టైటిల్స్‌ను సరఫరా చేస్తున్నారు.

రెండు విధాలుగా పాఠ్య పుస్తకాల సరఫరా

గత విద్యా సంవత్సరం వరకు పాఠ్య పుస్తకాలు ఉమ్మడి జిల్లా పరిధిలోని ధవళేశ్వరంలో ఉన్న పుస్తక గోదాంకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన ప్రింటింగ్ ప్రెస్‌ల ద్వారా సరఫరా చేసేవారు. అక్కడ నుంచి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలకు సరఫరా చేసేవారు. అయితే ఈసారి పాఠ్య పుస్తకాలను రెండు విధాలుగా సరఫరా చేస్తున్నారు. 1–7 తరగతులకు నేరుగా పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పుస్తక గోదాం నుంచి మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తుండగా, 8–10 తరగతులకు ప్రభుత్వ అనుమతి పొందిన ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే 1–7 తరగతులకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 14,97,436 పుస్తకాలు సరఫరా కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు గ్రౌండ్ బ్యాలెన్స్‌తో కలిపి 6,54,000 పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. ఇక్కడ నుంచి ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా కావాల్సి ఉంది. ఇదిలా ఉంటే 8–10 తరగతులకు నేరుగా పాఠ్య పుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు సరఫరా ప్రారంభమైంది.

16.75 లక్షల పుస్తకాల అవసరం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 22 మండలాల్లోని 1,580 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు ప్రభుత్వం ఏటా ఉచితంగా పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తోంది. సెమిస్టర్–1, సెమిస్టర్–2కు సంబంధించి జిల్లాకు 16.75 లక్షల పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్ సరఫరా కావాల్సి ఉంది. 1.83 లక్షల వరకు వర్క్‌బుక్స్ కూడా సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాల సరఫరా ప్రారంభమైంది. వేసవి సెలవులు ముగిసే నాటికి జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి మండల స్టాక్ పాయింట్లకు పాఠ్య పుస్తకాలను చేరవేసి, పాఠశాలల పునఃప్రారంభించే రోజునే విద్యార్థుల చేతికి విద్యాకానుక-5 అందజేయాలనే లక్ష్యంగా పాఠశాల విద్యాశాఖ కృషి చేస్తోంది.

నిరంతరం సమీక్ష



నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాల సరఫరా ప్రారంభమైంది. ఏ మేరకు సరఫరా అయ్యాయనే విషయమై నిరంతరం మండల విద్యాశాఖాధికారులతో సమీక్షిస్తున్నాం. విద్యాకానుక–5 సంబంధించి కాంపొనెంట్స్ వారీగా సమీక్ష చేస్తున్నాం.

– బీవీవీ సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి, సమగ్ర శిక్షా, అమలాపురం

మండల స్టాక్ పాయింట్ల తనిఖీ



మండల స్టాక్ పాయింట్‌కు వచ్చిన మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. మండల స్టాక్ పాయింట్లలో కాంపొనెంట్ వారీగా కమిటీలు ఏర్పాటు చేశాం.

– ఎ.మధుసూధనరావు, డిప్యూటీ కలెక్టర్, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం.

విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే...



పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభమవుతాయి. ఆ రోజుకు ప్రతి విద్యార్థి చేతిలో పాఠ్య పుస్తకం ఉండాలనేది ఉన్నతాధికారుల లక్ష్యం. ఆ మేరకు పాఠ్య పుస్తకాల సరఫరా వేగంగా సాగుతోంది.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారిణి, అమలాపురం.

క్లుప్తంగా

23న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు కాకినాడ జిల్లా పరిషత్‌లోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలన్నారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్టు సీఈవో శ్రీరామమూర్తి తెలిపారు.

ఆ ఊరి గాయల రుచే వేరు!

- పచ్చళ్ల తయారీలో ఆ గ్రామాలు అదుర్స్
- విదేశాలకు సైతం ఎగుమతి
- పలు కుటుంబాలకు జీవనోపాధి


ఆవకాయ కోసం తయారైన మామిడిముక్కలు


పచ్చళ్ల కోసం తయారైన మామిడిముక్కలు


తయారైన ఆవకాయ

ఆత్రేయపురం: ఒక్కొక్క వంటకానికి ఒక్కొక్క ఊరు ప్రసిద్ధి. కానీ ఊరగాయల తయారీకి మాత్రం ఆ గ్రామాలే పెట్టింది పేరు. అక్కడ నుంచి ఊరగాయలు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతాయి. ఆ గ్రామాల వారు పచ్చళ్ల తయారీతో జీవనోపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఆహా ఏమి రుచి తినరా మైమరచి అన్నట్టు... తినేవారికి నోరూరించే పచ్చళ్ల తయారీకి ఆత్రేయపురం మండలం ప్రసిద్ధి చెందింది. ఆవకాయకు ఆంధ్రా పెట్టింది పేరు కాగా కోనసీమలోని ఆత్రేయపురం, నార్కెడిమిల్లి, అంకంపాలెం, ఉచ్చిలి, ర్యాలి గ్రామాలు పచ్చళ్ల తయారీకి ప్రసిద్ధి చెందాయి. ఆవకాయ పచ్చడి తయారీలో ఈ గ్రామాల వారు మామిడికాయలకు కారం, నూనె, ఆవపిండి, ఉప్పు, వెల్లుల్లి, మెంతులు తదితర మసాలా దినుసులతో పాటు, ఆప్యాయతలు రంగరించి సొంత వాడకానికి చేసినట్టుగా పచ్చళ్లు తయారు చేస్తుంటారు. దీంతో వీటి ముందు కార్పొరేట్ కంపెనీల పచ్చళ్లు సైతం దిగదుడుపే అవుతాయి.

కుటీర పరిశ్రమగా..

ఆత్రేయపురం మండలంలో నార్కెడిమిల్లి, ఆత్రేయపురం, అంకంపాలెం, ఉచ్చిలి, ర్యాలి గ్రామాల్లో సుమారు 15 వేలకు పైగా జనాభా ఉండగా 20 శాతం మంది పచ్చళ్ల తయారీనే కుటీర పరిశ్రమగా ఎంచుకుని జీవనోపాధి పొందుతున్నారు. సుమారు వెయ్యి కుటుంబాల వారు వేసవిలో పచ్చడి తయారు చేసి ఏడాది పొడవునా అమ్మకాలు సాగిస్తుంటారు. దీంతో పాటు సీజన్‌ల వారిగా ఏడాది పొడవునా వివిధ రకాల పచ్చళ్లు తయారు చేస్తుంటారు. ఆవకాయ, తీపి ఊరగాయ, మాగాయ, టమాటా, అల్లం, ఎండు మిరపకాయ, చింతకాయ, ఉసిరి, గొంగూర, నిమ్మకాయ, కాలీఫ్లవర్, ములక్కాడ పచ్చళ్ళను ఆయా సీజన్‌లను బట్టి తయారు చేస్తుంటారు. ఎంచుకున్న కూరగాయలతో పాటు తగినంత ఉప్పు, కారం, వెల్లుల్లి, పోపులు, నూనె వంటి దినుసులు వేసి వీరి చేతులతో కలిపితే ఆ రుచులే వేరు. మహిళలు తయారు చేసిన పచ్చళ్లను కుటుంబంలోని పురుషులు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. కడప, పులివెందుల, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఈ పచ్చళ్ళకు మంచి పేరుంది. విదేశీ గడ్డపై కూడా ఈ పచ్చళ్లు నోరూరిస్తూ ఆంధ్రా సత్తా చాటుకున్నాయి. నార్కెడిమిల్లిలో సుమారు 170 డ్వాక్రా సంఘాలు పావలా వడ్డీ రుణాలతో పచ్చళ్లు తయారు చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు.

పెరిగిన ధరలతో తయారీ భారం

ఆవకాయ తయారు చేసేందుకు ఉపయోగించే మామిడికాయలు, ఇతర దినుసుల ధరలు పెరగడంతో పచ్చళ్ల తయారీ పెనుభారమౌతోందని ఈ పరిశ్రమపై ఆధారపడిన వారు అంటున్నారు. మామిడికాయ టన్ను ఒక్కంటికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు చెల్లిస్తుండగా ఎండుమిర్చి క్వింటాల్ రూ.18 వేల నుంచి రూ.20 వేలు, క్వింటాల్ ఉప్పు బస్తా రూ.400, 20 లీటర్ల నూనె డబ్బా రూ.3,500, ఆవాల బస్తా రూ.700, మెంతులు బస్తా రూ.900, వెల్లుల్లి క్వింటాల్‌కు రూ.15వేలు పలుకుతుందని చెబుతున్నారు. దీనికితోడు కూలీ ధరలు విపరీతంగా పెరగడంతో టన్ను మామిడికాయలతో తయారు చేసిన పచ్చడికి సుమారు రూ.65 వేలు ఖర్చు అవుతోంది. ఈ గ్రామాల వారు ఇంటి వద్ద కేజీ పచ్చడి రూ.225 నుంచి రూ.300కి విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వీరి వద్ద నుంచి కొనుగోలు చేసిన చిరు వ్యాపారాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల్లో విక్రయించి జీవనోపాధి పొందుతారు. సీజన్ వారీగా పచ్చళ్లను తయారు చేసి ఏడాది పొడవునా దాన్ని భద్రపరచి అమ్మకాలు సాగిస్తుంటారు. అందుకు గాను వేసవిలో తమకున్న పరపతినంతా ఉపయోగించి మూడు వేల కుటుంబాల వారు ప్రైవేటు వ్యక్తుల వద్ద, బ్యాంకుల వద్ద రుణాలు తెచ్చి పచ్చళ్లు తయారు చేస్తారు. సగటున ఒక్కొక్క కుటుంబం వారు పది టన్నుల మామిడికాయలు దిగుమతి చేసుకుంటారు. అందుకే వేసవిలో ఈ గ్రామాల్లో ఏ ఇంట చూసినా మామిడిరాశులు కనుల విందు చేస్తాయి. మూడు వేల కుటుంబాల వారు సుమారు 30 వేల టన్నుల వరకు మామిడికాయలను దిగుమతి చేసుకుంటారు.

పచ్చళ్ల తయారీతో ఉపాధి



పచ్చడి తయారీతో జీవనోపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. గత 30 ఏళ్లుగా పచ్చడి తయారీలో అనుభవం ఉంది. – సుంకర బ్రహ్మానందం, అంకంపాలెం

వేసవిలో తయారు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తాను



ఏటా వేసవిలో పెట్టుబడులు పెట్టి పచ్చళ్లు తయారు చేస్తాను. ఆ పచ్చళ్లను హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తూ పలువురి ఉపాధికి తోడ్పడుతున్నాను.
– అద్దాల రమేష్, ఆత్రేయపురం

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


రైలు నుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి (60) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడడంతో తల, కాళ్లకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీలంరంగు ప్యాంటు, గులాబీ రంగు ఫుల్ చేతుల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడియం: మండలంలోని కడియం–ద్వారపూడి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే పట్టాలపై సుమారు 40 సంవత్సరాల వయసు గల పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. తెలుపు రంగుపై నలుపు రంగు డిజైన్‌ల ఫుల్‌హేండ్స్ చొక్కా, సిమెంటు రంగుపై తెలుపురంగు డిజైన్ గల షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. అతడి మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. ఇతడి ఆచూకీ తెలిసినవారు 94914 44022 నంబర్‌లో రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

సెంట్రల్ జైలుకు బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు


బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డుకు ఎంపికైన సెంట్రల్ జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు –2024 వరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఈ అవార్డును ఈ నెల 22న అంతర్జాతీయ వైవిధ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అందజేయనున్నారు. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ సోమవారం ఆ వివరాలను వెల్లడించారు. సెంట్రల్ జైలులో పర్యావరణ సమతుల్యతకు వివిధ రకమైన మొక్కలు, వృక్షజాతులు, పక్షులను పెంచుతున్నట్టు పేర్కొన్నారు. పురాతన కట్టడాలు, సంస్కృతి పరిరక్షణ, సోలార్ వంటి సహజ వనరుల వినియోగం, నీటి వనరుల సంరక్షణ, తోటలకు సేంద్రియ ఎరువుల వాడకం, పర్యావరణ కాలుష్యం లేకుండా కుండల్లో మంచినీరు, ఖద్దరు దుస్తుల తయారీ, కొబ్బరి నారతో తాళ్లు, ఫ్లోర్ మ్యాట్స్, సంప్రదాయ పద్ధతులు పాటించడం వంటివి గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్టు ఆయన తెలిపారు.

ఉపాధి కూలీకి పాముకాటు

కడియం: మండల కేంద్రమైన కడియం పంచాయతీ పరిధిలో ఉపాధి పనుల్లో నిమగ్నమై ఉన్న నీలగిరి సత్యనారాయణను సోమవారం పాము కరిచింది. విషయాన్ని గమనించి అతడిని వెంటనే కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆసుపత్రిలో సత్యనారాయణను పరామర్శించి, అతడి ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వాసుపత్రి వైద్యుడు శివశంకర్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజ్‌మనోజ్ మాట్లాడుతూ సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారన్నారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉంచారని వివరించారు.

బాణసంచా పట్టివేత

గోపాలపురం: మండలంలోని కరిచర్లగూడెంలో అనధికారికంగా నిల్వ ఉంచిన బాణసంచాను పట్టుకున్నట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కరిచర్లగూడెం గ్రామానికి చెందిన షేక్ దాదా సాహెబ్ అనధికారికంగా బాణసంచా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అతని వద్ద నుంచి సుమారు రూ.10వేల విలువైన బాణసంచా సామగ్రిని పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

వరుణుడు, సూర్యునికి బూరెల నివేదన


బూరెలను ఆకాశం వైపు ఎగురవేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు. చిత్రంలో ఈఓ రామచంద్రమోహన్, వేద పండితులు

- వర్షం ఆటంకం లేకుండా సత్యదేవుని కల్యాణం జరిగినందుకు కృతజ్ఞతలు
- ఆకాశం వైపు బూరెలు ఎగురవేసిన దేవదాయశాఖ కమిషనర్ దంపతులు

అన్నవరం: వర్షం కురవకుండా రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణం ఆదివారం రాత్రి నిర్విఘ్నంగా జరగడంపై వరుణ దేవునికి, సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలియచేస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు సోమవారం ఉదయం బూరెలు నివేదించారు. కమిషనర్ దంపతులు సోమవారం ఉదయం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఆలయంలోని దిగువన గల యంత్రాలయంలో గల సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్దకు వచ్చి సూర్యభగవానుడు, వరుణదేవునికి బూర్లు నివేదించి ఆకాశం వైపు గాలిలో ఎగురవేశారు. వాటిని భక్తులు ఏరుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఆదివారం సాయంత్రం వర్షం కురియడంతో సత్యదేవుని కల్యాణ మహోత్సవానికి ఎక్కడ ఆటంకం ఏర్పడుతుందో అని అందరూ ఆందోళన చెందారు. రాత్రి ఏడు గంటలకు కూడా ఆకాశంలో దట్టమైన మేఘాలతో కూడిన వాతావరణం ఉండడంతో గ్రామంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు రద్దు చేశారు. అయితే రాత్రి కల్యాణ సమయంలో వర్షం కురవకపోవడంతో స్వామివారి కల్యాణం నిర్విఘ్నంగా వార్షిక కల్యాణ వేదిక మీద ఘనంగా నిర్వహించారు. మిగిలిన ఐదు రోజులు కూడా కరుణించాలని సోమవారం సూర్యభగవానుడిని వేడుకున్నారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ , పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చోరీకి గురైన 281 ఫోన్లు బాధితులకు అందజేత


పోగొట్టుకున్న సెల్‌ఫోను బాధితురాలికి అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఇప్పటి వరకు రూ.2.52 కోట్ల విలువైన ఫోన్లు అందించిన పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో చోరీకి గురైన, పోగొట్టుకున్న 281 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ఎస్పీ పి.జగదీష్ సోమవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ పోగొట్టుకున్న ఫోన్లను చాట్‌బోట్ ద్వారా ఒక వాట్సాప్ మెసేజ్‌తో రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నామని, ఇప్పటి వరకు ఆ విధంగా రూ.2.52 కోట్ల విలువైన 1,393 ఫోన్లు బాధితులకు అందజేశామన్నారు. ఫోన్ చోరీకి గురైన వారు చాట్ బోట్ సేవలను సేవలను వినియోగించుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు ఎవరికైనా దొరికితే వాటిని సొంతానికి వాడుకోవడం, గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా బిల్లులు లేని సెల్‌ఫోన్లను కొనడం చేయరాదన్నారు. దొరికిన సెల్ ఫోన్లను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి అందజేయాలన్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లు ఇతర రాష్ట్రాలైన కేరళ, కర్నాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి రికవరీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఫోన్లు రికవరీ చేసిన అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలు, ఐటీ కోర్ టీం ఎస్సై అయ్యప్పరెడ్డి, కానిస్టేబుల్స్ కిరణ్, గౌతమ్, ప్రియాంక, గౌతమీ, శ్యామల, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తాడిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


లక్ష్మణరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


లక్ష్మణరావు (ఫైల్)

కొత్తపల్లి: తాడిచెట్టుపై కల్లు గీసేందుకు ఎక్కిన కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం కొమరగిరిలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన కల్లుగీత కార్మికుడు శీలం లక్ష్మణరావు (53) సోమవారం ఉదయం కల్లు గీసేందుకు తాడిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. అతని కూలిపని ఆధారంగా బతికే ఆ కుటుంబ సభ్యులు లక్ష్మణరావు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేద కార్మికునికి పెద్ద కష్టం

- కాలేయ, క్లోమ వ్యాధులతో పోరాటం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు


విజయ్‌కుమార్ వైద్యం కోసం ఆవేదన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు


కాలేయ, క్లోమ వ్యాధులతో బాధపడుతున్న విజయ్‌కుమార్

తాళ్లరేవు: రెక్కాడితేగాని డొక్కాడని పేద కార్మికునికి పెద్ద కష్టం వచ్చి పడింది. ఒక్కగానొక్క కొడుక్కి అనుకోకుండా వచ్చిన అనారోగ్యంతో ఆ కుటుంబం అల్లాడిపోతుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ రచ్చవారిపేటకు చెందిన 26 ఏళ్ల రచ్చ విజయకుమార్ పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాది క్రితమే దీపిక అనే యువతితో అతనికి వివాహం జరిగింది. ప్రస్తుతం భార్య గర్భవతి. ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబంలో అనుకోని అనారోగ్య సమస్య ఇబ్బందులకు గురి చేసింది.

రెండు నెలల క్రితం విజయకుమార్‌కు పెయింటింగ్ పనిచేస్తున్న సమయంలో కడుపులో తీవ్ర నొప్పి రావడంతో తాళ్లరేవు ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అక్కడ మూడు రోజుల చికిత్స అనంతరం కాకినాడలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్య ఖర్చులు తట్టుకోలేక ప్రస్తుతం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అయితే అప్పటికే ఆరోగ్యశ్రీ కోటా అయిపోయిందని ఆసుపత్రి వర్గాలు చెప్పడంతో ఆ పేద కుటుంబం స్తోమతకు మించి అప్పు చేసి వైద్యానికి ఖర్చు పెట్టారు. తమకున్న ఇల్లు కూడా తాకట్టు పెట్టి వైద్యం చేయిస్తున్నారు. గ్రామస్తులు తమకు తోచిన సాయం చేసినా ఏ మాత్రం సరిపోవడంలేదని విజయ్‌కుమార్ తల్లిదండ్రులు రచ్చ సూర్యనారాయణ, కామేశ్వరి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయ్‌కుమార్ తండ్రి మత్స్యకారుడైనప్పటికీ వృద్ధాప్యంతో ఏ పని చేయలేకపోతున్నాడు. నలుగురు కుమార్తెల అనంతరం పుట్టిన కుమారుడు విజయ్‌కుమార్‌ను కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తన ఇంటితో పాటు కుమార్తె ఇల్లు తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చి వైద్యానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా ఆపరేషన్, ఇతర ఖర్చుల కోసం సుమారు రూ.3 లక్షల వరకూ అవసరం అవుతుందని, దాతలు సహాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. సహాయం చేసేవారు 97045 55308 నంబరులో సంప్రదించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

Wanted Lecturers in English, Mathematics, Statistics, Computers & Commerce
Sri Venkateswara College of Arts & Science, Degree College, Amalapuram
98491 36584, 95058 44123

GLOBAL VISION E.M.HIGH SCHOOL
Regd. by Govt of AP (I to X)
WANTED IMMEDIATELY
Wanted Well Experienced Trained Teachers to teach Telugu, Hindi, Biology for High School, Primary Teachers, Wardens, Cooks, PET for School in Nallamilli, Near Biccavolu.
99899 22855, 95332 71993
63048 13663

WANTED WARDENS
(Male/Female Candidates)
For ADITYA HOSTELS
QUALIFICATION:
Any Degree with fluency in English & Hindi
FREE LODGING & BOARDING
(BACHELORS PREFERRED)
ADITYA ACADEMY
Srinagar, KAKINADA
Ph: 7036146665
77320 76668

Gnana Saraswati Vidyanikethan (Gokavaram)
(Nursery to Class 10th) (IIT & NEET Foundation)
We invite applications from both experienced and fresh aspirants to work in our organisation. You can attend the interview followed by a demo from 21st May to 23rd May from 9 am to 5 PM

Post	Subject	Salary
Teachers for IIT & Olympiad (6th to 10th)	Maths, Physics Chemistry	30,000 to 40,000/-
High School Teachers (6th to 10th)	All Subjects	20,000 to 30,000/-
Primary Teachers (Nursery to 5th)	All Subjects	15,000 to 20,000/-
PET's, Computer Operators & Non-Teaching Staff	Non-Academic	15,000 to 20,000/-

Interested candidates may attend the interview with their original Certificates.
For More Details GNANA SARASWATI VIDYA NIKETHAN, GOKAVARAM 77804 66511, 81433 86664, 9110 366 299

సాక్షి క్లాసిఫైడ్స్

Services

అమ్మ హోం కేర్ సర్వీస్
■24 గంటలు వృద్ధులకు, పేషంట్లకు, బేబీకేర్, ఇంటి పని, వంట పనికి అనుభవం గల ఆయా వర్కర్లను మీ ఇంటికి పంపగలం. వరంగల్. సెల్: 8522903927, 9059835761. [W-1242463]

TOURS & TRAVELS
■ దసరా సందర్భంగా రాజస్థాన్ రైలుయాత్ర తేది 01-10-2024, 11రోజులు టిక్కెటు 1కి 21,000/-. (భోజనం, ACరూం + ACబస్సు) K.వాసు, నెల్లూరు. సంప్రదించండి: 94913 40504. [NA-23426]

Wanted

■రాజమండ్రి S.V.G.Market Jayantilal & Son's shop No. 38,39. Kirana Masala Shop నందు పనిచేయుటకు Helpers స్త్రీ మరియు పురుషులు కావలెను. Cont: ✆ : 94413 92262 [R-1154958]

■ రాజమండ్రి ఆయిల్ ఫీల్డ్‌లో లైట్/హెవీ వెహికల్స్ నడుపుటకు కనీసం 3 సం॥ అనుభవం కలిగిన డ్రైవర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సెల్ : 98490 63511 [R-1154960]

■ రాజమండ్రి మొగల్ బిర్యానీ ప్యాలెస్ రెస్టారెంట్ నందు పనిచేయుటకు అనుభవం గల కెప్టెన్లు, సప్లయర్స్, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. 9 వేలు పైన జీతం + భోజనం. సంప్ర॥ 85004 31651 [R-6719]

■ Female Experienced Tele Callers for Loans. Sal:10K to 15K Incentives, Rajamundry Location. Cantact Cell: 90301 00111. [T-2070]

■ హైదరాబాద్‌లో ఇంటిలో ఉండి వంట పని చేయుటకు 30/40 సం॥ల వయసు గల క్రైస్తవురాలైన స్త్రీ కావలెను. భోజనం, వసతి, రూ.15 వేలు జీతం. సెల్ : 94403 96004, 94924 33897 [R-2150]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500rs. మీ పేరు, కాల్ / వాట్సాప్ చేయగలరు. 9502615217 [G-8890]

■ వైజాగ్ హోంకేర్ సర్వీసెస్, శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు, పెద్దవారికి, పేషంట్లకు చూసుకొనుటకు వర్కర్స్ P/T కావలెను.రూం+భోజనం ఫ్రీ జీ:15వేలు-18వేలు.7075198754, 8919920111 [G-786675]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 9014885406 [HA-138]

■ ప్రముఖ ఎయిర్‌పోర్టులో పనిచేయుటకు లోడింగ్ సూ॥వైజర్స్, హౌస్ కీపింగ్ సూ॥వైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/-, రూమ్+భోజనం ఫ్రీ. ఫోన్: 9642261084 [H-788 087]

■ హైదరాబాద్ (చేవెళ్ల)లో కాలేజీలో ఉంటూ గార్డెన్ మరియు కాలేజ్ పనిచేయడానికి భార్యాభర్తలు కావలెను. జీతం : 13000 + వసతి కలదు. Ph: 8919737607, 8328443702 [H-778914]

■ మాకంపెనీ కొరకు 80మంది స్త్రీ,60మంది పురుషులు & టెలికాలర్స్ (F) అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+భోజనం +జీతం: 24,000/- వరకు. డైరెక్ట్ జాబ్, స్పాట్ జాయినింగ్. ఫోన్: 9966310431 [HA-10856]

■ రాజమండ్రి ఓల్డ్ బైపాస్ దగ్గర DMH స్కూల్ దగ్గర ప్రముఖ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డ్స్ లేడీ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను .డ్యూ 12 గం. జీతం: 13000/–, 2 Week off, ESI, PF. ✆ 89783 24567,99859 56778 [B-755720]

■ కాకినాడ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం॥ డ్యూటీ. 4 వీక్లీ ఆఫ్స్, 26 వర్కింగ్ డేస్. గ్రాస్ శాలరీ : 14,897/- Intime Salary ఆఫీస్ : సిద్ధార్థ్ నగర్, కాకినాడ. ఫోన్ : 92469 84359, 90001 14053 [V-823792]

■ప్రముఖ సెక్యూరిటీ సంస్థ యందు రాజమండ్రి, కాకినాడ పరిసరాలలో పనిచేయుటకై ఫీల్డ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, గార్డులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, PF & ESI కలదు. సంప్ర. ✆ : 74167 12755, 79933 21799, 92480 34803 [R-63]

■ టెలీకాలర్స్ కావలెను: విద్యార్హతతో సంబంధం లేదు. ఫోన్‌లో స్పష్టంగా మాట్లాడ కలిగి విషయాన్ని అర్థం చేయించగలిగిన వారు వెంటనే సంప్రదించగలరు. ఆకర్షణీయమైన జీతం & ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. Raja Ratna Group, Rama Chandra Puram. ✆ 93468 66544. [B-190504]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.